सत्यमेव जयते

యూఏఈకి వెళ్లే భారతీయులకు భారత రాయబార కార్యాలయం జారీ చేసిన ముఖ్య సూచనలు

విషయం: యూఏఈలోకి నిషేధిత, పరిమితులు విధించిన మరియు నియంత్రిత వస్తువులు తీసుకురావడంపై హెచ్చరిక

యూఏఈలో నివసిస్తున్న, యూఏఈకి ప్రయాణించే లేదా అక్కడి నుంచి ఇతర దేశాలకు వెళ్లే భారతీయులు ఈ సూచనలను తప్పనిసరిగా పాటించాలి. భారతదేశంలో చట్టబద్ధమైన కొన్ని ఆహార పదార్థాలు, మందులు, ఇతర వస్తువులను యూఏఈలోకి తీసుకెళ్లడంపై నిషేధాలు, ఆంక్షలు ఉన్నాయి. నిషేధిత వస్తువులను తెలియక తీసుకెళ్లినా వాటి స్వాధీనం, భారీ జరిమానాలు, నిర్బంధం, దేశ బహిష్కరణ లేదా క్రిమినల్ చర్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

(i) నిషేధిత, పరిమిత ఆహార పదార్థాలు: గసగసాలు, ఖాట్ ఆకులు, తమలపాకులు, వక్కలు, నశ్వార్ (పొగలేని పొగాకు), గుట్కా వంటి పదార్థాలను యూఏఈలోకి తీసుకెళ్లడం నిషేధం. వీటిని హ్యాండ్ బ్యాగేజీ లేదా చెక్-ఇన్ లగేజీలో తీసుకెళ్లకూడదు.

(ii) యూఏఈకి మందులు తీసుకెళ్లే వారికి సూచనలు: మాదక లేదా నిషేదించిన   మందులను యూఏఈకి తీసుకెళ్లే ముందు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలి.

a) నిద్రమాత్రలు, తీవ్రమైన నొప్పి నివారణ మందులు, మానసిక సమస్యలకు వాడే కొన్ని మందులు యూఏఈలో నియంత్రిత మందులుగా పరిగణించబడతాయి. వాటి వివరాలను www.ede.gov.ae వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

b) నిషేధిత లేదా మాదక మందులను యూఏఈకి తీసుకెళ్లేవారు ప్రయాణానికి ముందే www.ede.gov.ae ద్వారా వైద్య ప్రిస్క్రిప్షన్ లేదా నివేదికను సమర్పించి, వ్యక్తిగత వినియోగానికి అవసరమైన అనుమతిని ఉచితంగా పొందవచ్చు (సాధారణంగా ఒక పని దినంలో); సహాయం కోసం 800-33784 లేదా info@ede.gov.ae ను సంప్రదించవచ్చు.

C) అవసరమైన వైద్య ప్రిస్క్రిప్షన్ లేదా అధికారిక అనుమతి లేకుండా, లేదా అనుమతించిన పరిమితికి మించి నియంత్రిత మందులను తీసుకెళ్తే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు అరెస్టు, కేసులు, జైలు శిక్ష వంటి చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చు. భారతదేశంలో ప్రిస్క్రిప్షన్ ఉన్నా యూఏఈ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

(iii) పూర్తిగా నిషేధిత వస్తువులు: మాదక ద్రవ్యాలు, మానసిక ప్రభావం కలిగించే పదార్థాలు, నకిలీ కరెన్సీ, పైరసీ వస్తువులు, జూదానికి ఉపయోగించే పరికరాలు, మూడు పొరల నైలాన్ చేపల వలలు, చేతబడి, క్షుద్రవిద్యకు సంబంధించిన వస్తువులు, ప్రమాదకర మరియు రేడియోధార్మిక పదార్థాలను యూఏఈలోకి తీసుకెళ్లడం పూర్తిగా నిషేధం.

(iv) పరిమిత వస్తువులు (UAE అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరి):

ఆయుధాలు, తూటాలు, పేలుడు పదార్థాలు, బాణసంచా; జంతువులు, మొక్కలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు; మందులు, వైద్య పరికరాలు; పుస్తకాలు, పత్రికలు, రికార్డ్ చేసిన ఆడియో, వీడియోలు, ప్రసార పరికరాలు; వైర్‌లెస్, కమ్యూనికేషన్, GPS పరికరాలు; మద్యం; ఈ-సిగరెట్లు, ఎలక్ట్రానిక్ హుక్కాలు, వాహనాల టైర్లు, సౌందర్య సాధనాలు, కొన్ని విద్యుత్ పరికరాలు; అణు, రేడియోధార్మిక పదార్థాలు, ముడి వజ్రాలు.

(v) నగదు వివరాలు వెల్లడించడం:

ప్రయాణికుల వద్ద నగదు, బేరర్ చెక్కుల వంటి ఆర్థిక పత్రాలు, బంగారం వంటి విలువైన లోహాలు లేదా రత్నాలు కలిపి 60,000 UAE దిర్హామ్‌లకు మించి ఉంటే, UAEలోకి ప్రవేశించే సమయంలో లేదా దేశం విడిచి వెళ్లే సమయంలో కస్టమ్స్ అధికారులకు తప్పనిసరిగా వాటి వివరాలు తెలియజేయాలి. ఇతర దేశాల కరెన్సీలో ఈ మొత్తానికి సమానమైన విలువ ఉన్నా ఇదే నిబంధన వర్తిస్తుంది.

2. పై నిబంధనలను దృష్టిలో ఉంచుకుని, UAEకి ప్రయాణించే లేదా అక్కడ నివసిస్తున్న భారతీయులకు ఈ క్రింది సూచనలు తెలియజేయడమైనది:

a) ప్రయాణానికి ముందు మీ లగేజీని పూర్తిగా తనిఖీ చేసుకోండి. UAEలో నిషేధించిన లేదా ప్రత్యేక అనుమతి అవసరమైన వస్తువులు సరైన అనుమతులు లేకుండా మీ వెంట తీసుకెళ్లకండి.

b) ఇతర ప్రయాణికులు లేదా వ్యక్తులకు సంబంధించిన లగేజీని అందులో ఏమున్నాయో పూర్తిగా తెలుసుకోకుండా మీ వెంట తీసుకెళ్లకండి.

c) నిషేధిత జాబితాలో ఉన్న (మత్తు కలిగించే లేదా మానసిక ప్రభావం చూపే) మందులను తీసుకెళ్లాల్సి వస్తే, ముందుగానే అవసరమైన అనుమతి పొందాలి లేదా సంబంధిత వైద్య పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలి. మందుల తాజా పూర్తి జాబితా కోసం ప్రయాణానికి ముందే UAE ఫెడరల్ కస్టమ్స్ అథారిటీ, దుబాయ్ కస్టమ్స్, అబుదాబి కస్టమ్స్ మరియు ఎమిరేట్స్ డ్రగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారిక వెబ్‌సైట్లను పరిశీలించాలని ప్రయాణికులకు సూచించడమైనది.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE)

అబుదాబి / దుబాయ్

అక్టోబర్ 26, 2026